# "గుళ్ళో భూగోళం"

**- వి. యన్. మంజుల**

నెల, నెలన్నర నుండీ ఆడపడుచు పెళ్ళి హడావిడిలో శారీరకంగా, మానసికంగా బాగా అలసిపోయి వుంది నీరజ. తను ఇంటికి పెద్దకోడలు అవటం మూలాన బాధ్యత తప్పలేదు. హడావుడి అంతా అయి రెండురోజుల క్రితమే అంతా ఎక్కడి వాళ్లక్కడ సర్దుకున్నారు. ఇంట్లో తను, భర్త మోహన్, బాబు సుధీర్, పాప సురేఖలు మాత్రం మిగిలారు.

నీరజ భర్త మోహన్ ప్రైవేట్ కంపెనీలో ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. పిల్లలిద్దరూ అయిదు, ఆరు సంవత్సరాలవాళ్ళు. నీరజ కూడా పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసింది. ఉద్యోగం అవసరం లేదని భర్త మోహన్ అనటంతో అయిష్టంగానే ఆ ప్రయత్నం మానుకుంది నీరజ.

గత నెలన్నర నుండీ ఆడపడుచు హైమ పెళ్ళి కుదరటంతో తర్జన భర్జనలూ, ఏర్పాట్లూ, హైరానాలు, హంగామాలలో మునిగిపోయింది నీరజ. ఇన్నాళ్ళ హడావుడిలో లోటుపాట్లూ, అవకతవకలు అన్నీ కడుపులో దాచుకున్నా, అయినవాళ్ళంతా వెళ్ళాక మరునాడు భర్తకి ఉదయాన్నే కాఫీ అందించడంతో మొదలైంది చర్చ. మోహన్ తమ్ముడు మురళి, భార్య శుభ నాలుగు రోజులు ముందొచ్చి పెళ్ళయిన మరునాడే చేతులు దులుపుకుని వెళ్లిపోయారు. నీరజకి చెప్పలేనంత కసి, కోపంగా వుంది. ఇలాంటి ఎన్నో విషయాలని నలుగురి ముందూ అప్పుడేం అనలేక ఎప్పుడెప్పుడు వాటిని భర్తతో చర్చిద్దామా, దానికి ఆయన సమాధానం, ఫీలింగ్ ఏమిటో తెలుసుకోవాలని తెగ ఆరాటంగా వుంది నీరజకి.


ఉదయాన్నే కాఫీ కప్పు అందిస్తూ ఆ విషయాన్ని ప్రస్తావనకి తెచ్చింది. చిలికి చిలికి గాలివాన అయ్యింది. మాటా మాటా పెరిగింది. తనన్న దాంట్లో తప్పులేదని నీరజ, అసలా ఆలోచనలే రానీవద్దని భర్తా ఒకరినొకరు తప్పు పట్టుకున్నారు. వాదన వల్ల ఇద్దరూ ఎడమొహం, పెడమొహం అయి అన్యమనస్కంగా చెరోవైపూ వెళ్ళిపోయారు. పనులన్నీ ముభావంగానే జరిగిపోయాయి. గంభీరంగానే పనులు పూర్తిచేసుకుని ఆఫీసుకి వెళ్ళిపోయాడు మోహన్.

పనంతా పూర్తిచేసుకుని ముందుగదిలో సోఫాలో కూచుని జరిగిందంతా తలుచుకుంటూ కూచుంది నీరజ. "ఛ..ఛ మనసంతా ఎలాగో అయిపోయింది. ఈ జన్మ ఇంతే. ఇప్పుడు నేనేమన్నాని. వాళ్ళవాళ్ళని ఒక్కమాట కూడా అననీరు. ఉన్నదున్నట్టన్నా ఒప్పుకోరు. ఈ మగాళ్లంతా ఇంతే. ఏమిటో ! మనుష్యులమన్నాక ఒక్కమాటైనా అనకుండా ఎలా ఉంటాం. ఈ మూడ్‌లోంచి బయటికి రావాలంటే సాయంత్రం కాసేపు దగ్గరలో వున్న గుడికి వెళ్లివస్తే సరి అని తనకు తానే సర్ది చెప్పుకుంది.

సాయంత్రం ఆరవగానే పనంతా పూర్తిచేసుకుని, చక్కని కాటన్ చీర కట్టుకుని తయారయ్యింది నీరజ గుడికి. ఈలోపు మోహన్ ఆఫీసు నుండి వచ్చాడు. కాఫీ, టిఫిన్‌లను ముభావంగానే అతనికి అందించింది. చేతిలో చిన్న మనీపర్సు తీసుకుని ముందుగదిలోకి వచ్చి నిలబడింది. ఆ విషయం గమనించకుండా టీ.వి. చూస్తూ కూచున్నాడు మోహన్. తన ఉనికిని చిన్న దగ్గుతో తెలియజేసింది నీరజ. ఎవరా ? అన్నట్టు తలత్రిప్పి చూసాడు మోహన్. అంతే రక్కున ఆ ప్రక్కనే ఉన్న చెప్పులు వేసుకుంటూ -

"నేనలా కాసేపు గుడికి వెళ్లివస్తాను. పిల్లలు ఆడుకోవటానికి గ్రౌండ్‌కి వెళ్లారు. రాగానే చదువుకోమనండి. ఓ గంటా గంటన్నరలో వచ్చేస్తాను" అంటూ ఎటోచూస్తూ, మాటలను పాఠంలా అప్పచెప్పి బయటపడింది నీరజ.

దగ్గరలో ఉన్న ఈ గుడికి రావటం నీరజకేం కొత్తకాదు. ఒకే ఆవరణలో మూడు, నాలుగు దేవుళ్ళ గుళ్ళు ఉన్నాయి. బోలెడంత ఖాళీస్థలం, లెక్కలేనన్ని చెట్లు - కూర్చోటానికి వీలుగా పచ్చటి గడ్డి మొలక ప్రదేశాలు - చల్లని ఓదార్పునిచ్చే చల్లనిగాలి, ఇలా మనసు తేలికపరిచే



వాతావరణం ఉండటం వల్ల జనసందోహం కూడా ఒకింత ఎక్కువే. అందరి గోడూ వినేవాడు ఆ భగవంతుడొక్కడే కదా ! అందుకే మాట్లాడకుండా వినే ఈయనకైనా తన గోడు వెళ్ళబోసుకుందామనుకునే ప్రతి ఒక్కరూ తనలాగే ఇక్కడికి వస్తుంటారు కాబోలు అనుకుంది నీరజ.

ముందుగా వినాయకుడి దర్శనం అయ్యాక రామాలయం వెళ్ళి బయటికి రాగానే ప్రక్కనే ఉన్న పచ్చటి గడ్డిని చూడగానే కాసేపు ప్రశాంతంగా కూర్చోవాలనిపించి చతికిలబడింది నీరజ. ఇంతలో ఎదురుగా ఓ పండు ముసలావిడ అటుగా వస్తున్న మరో ముత్తైదువుని చూడగానే పలకరింపుగా –

"ఏవండీ కామాక్షిగారూ ! నిన్న గుడికి రాలేదేం ? చాలాసేపు మీకోసం చూసారు మనవాళ్ళందరూనూ. ఒంట్లో బాలేదా ! ఏమిటి ? అంటూ ప్రశ్నలు కురిపించింది.

"అబ్బే అదేం లేదండీ ! నాకు బాగానే ఉంది. మా కోడలు కాస్త నలతగా ఉంటేనూ ... రావడానికి కుదరలేదు. నిన్న సాయంత్రం ఆఫీసు నుండి రావడమే మూలుగుతూ వచ్చింది. ఓ ప్రక్క ఆ అమ్మాయి అలా ఉంటే ఇంకేం రాను గుడికి" అంది అన్యమనస్కంగా.

"అలాగా ... మంచి పనిచేసారు. వాళ్ళ నీడలో బ్రతుకుతున్నాం కాబట్టి వాళ్ల కనుగుణంగానే నడుచుకోవాలి లెండి. అందులోనూ ఈ రోజుల్లో కోడళ్లతో మనమెక్కడ తలపడగలం !" అంది దీర్ఘాలు తీస్తూ ముసలావిడ".

"అవునండీ ! అది మాత్రం నూటికి నూరుపాళ్లు నిజం. నిన్న నా అంతట నేను మానటమే మర్యాద నిలుపుకున్నట్టని పించింది. లేదంటే మా కోడలు నన్ను లోపలికి కూడా రానిచ్చేది కాదు" అంది అసలు విషయం బయటపెడుతూ కామాక్షిగారు.

"ఏం గడసరి కోడళ్లో ఏమిటోనమ్మా ! ఏళ్ళు పై బడుతున్నాయంటేనే భయంగా ఉంటోంది. అన్నట్టు మా ప్రక్క ఇంట్లో సీతాలక్ష్మి తెలుసుగా ! ఇవాళ ఉదయాన మొగవాళ్ళలా బయట పడగానే అత్తాకోడళ్ళిద్దరూ పెద్ద తగాదా!" అంటూ కడుపులో కుతి తీర్చుకుంది అసలు విషయం బయటపెట్టి ఆ ముసలావిడ.

"ఇంటింటికో కథ – మా ఇంటికి మరో కథ" అన్నట్టు ప్రతి ఇంట్లోనూ ఇలాంటివి తప్పవు కదండీ ! అంది కాస్త నిట్టూరుస్తూ కామాక్షమ్మగారు.

వీళ్ళ మాటలు విన్న నీరజ మనసులో ఓ అనుమానం తలెత్తింది.

"అత్తగార్లంతా ఇంతేనా ! అసలు కోడళ్లు మంచి వాళ్లుండరా ? లేక అత్తగార్లెవరూ చెడుగా ప్రవర్తించరా ? వీళ్లూ ఒకప్పుడు కోడళ్లే కదా ! తప్పంతా కోడళ్లదేనా ? అని తనలో తనే ప్రశ్నించుకుంటున్న నీరజ ఒక్కసారిగా అదిరిపడింది.

ఆ ముసలావిడనుకుంటా, ఓ పెద్ద అరుపు అరిచి ప్రక్కనున్న కామాక్షి గారి చేయి పట్టుకుని ఊపేస్తూ – "అదిగో, అదిగో కామాక్షిగారూ ! ఆ అమ్మాయే సీతాలక్ష్మి కోడలు. ఇందాక నే చెప్పలా పొద్దున్న అత్తగారితో తగాదా పడిందని. ఆ ప్రక్కనున్నది సీతాలక్ష్మి కొడుకనుకుంటాను". అని అంటుండగానే కామాక్షమ్మ దాన్ని బలపరుస్తూ.

"అవునండీ ! వాళ్ళబ్బాయే. భార్యాభర్తలిద్దరూ వచ్చినట్టున్నారు. ప్రొద్దున్న జరిగింది మొగుడికి చెప్పాలిగా ! ఈ వంకన బయటికి లాక్కొచ్చినట్టుంది వెళ్లబోసుకోటానికి" అంది.

అంతే ఒక్కసారిగా నీరజకి చిర్రెత్తుకు వచ్చింది. వాళ్ళిద్దరి ప్రోగ్రామ్‌నంతా వీళ్లే నిర్ణయించేస్తున్నారు.

'ఏం భార్యాభర్తలిద్దరూ గుడికి రాకూడదా ! ఆ అమ్మాయి చెప్పటానికే తీసుకొచ్చిందని ఏంటో వీళ్ల ధీమా ! మొగుడికి చెప్పినా లాభం లేదనుకుని, ఆ దేవుడికైనా మొరపెట్టుకుందామనుకున్నదేమో ! పాపం, అయినా నిజంగా ఒకవేళ చెప్పటానికే తీసుకువచ్చినా దాంట్లో తప్పేముంది ? కట్టుకున్న వాడితోనైనా చెప్పుకునే హక్కులేదా ఆ అమ్మాయికి. నిజంగా ఆ అమ్మాయి వీళ్లనుకున్నంత గడసరే అయితే, ఇంట్లోనే రాద్ధాంతం చేసేది. ఏం మనుషులు వీళ్లు. దేన్నీ సరిగ్గా అర్థం చేసుకోరు'. అంటూ తన మనసులోనే గొణుక్కుంది నీరజ బయటకనలేక.

"ఇక బయలుదేరుతానండీ ! ఇవేళ కాస్త పెందరాళే ఇంటికి వెడతాను. పారాయణానికి రేపు ముందే వచ్చేస్తా!" అంటూ కొంగు భుజాల చుట్టూ కప్పుకుంటూ బయటవైపుకి నడిచింది గబగబా కామాక్షమ్మగారు.

"ఆ..ఆ.. సరే నేనింకాసేపుండి వస్తాలెండి. అన్నట్టు మనవాళ్ళంతా అక్కడ శివాలయంలో ఉన్నట్టున్నారు." అనుకుంటూ ఈ ముసలావిడ ఇటుకేసి నడిచింది.

"ఇద్దరూ – ఇద్దరే" అనుకుంది నీరజ. అలా కూచున్న నీరజకి స్వకుటుంబ విషయాలన్నీ ఆలోచనలోకి రావడానికి సిద్ధంగా ఉన్నట్టనిపించి, తనని తాను సంభాళించుకుంది వాటికి దూరంగా. ఈలోపున ఒక్కసారిగా తనింకా శివదర్శనం చేసుకోలేదని గుర్తొచ్చి లేచి అటుకేసి నడిచింది.

భగవంతుని దర్శనం చేసుకుని ఓ నిముషం కూచుని లేద్దామని ఓ ప్రక్కగా కూచుంది నీరజ. తనకి కాస్త ప్రక్కగా ఇద్దరు మధ్య వయసున్న ఆడవాళ్ళు కూచుని ఒకరి చెవిని ఒకరు కొరికేసుకుంటున్నారు 'రహస్యాలు' చెప్పుకుంటూ, మాటల ద్వారా కాలనీ స్నేహితులనిపించింది నీరజకి. ప్రక్కన ఉన్న తనకి వద్దన్నా వాళ్ల మాటలు వినిపిస్తున్నాయి.

"ఏయ్ హరితా! అదిగో ఆ నవగ్రహాలకి ప్రదక్షిణాలు చేస్తోందే ! ఆ అమ్మాయి మా తోటికోడలి మరదలు. వాళ్ళమ్మావాళ్ళు ఇక్కడికి దగ్గరలోనే ఉంటారు" అని చెప్తోంది.

"ఏమిటి ! పిల్లలు లేరనీ ... అత్తగారూ వాళ్ళు పుట్టింటికి పంపారనీ అన్నావే ఆ అమ్మాయేనా ఈవిడ ! అంటూ సందేహ నివృత్తి చేసుకుంది హరిత.

"ఆ ... ఆ .. ఆ అమ్మాయ్. పెళ్లయి నాలుగేళ్లయింది. ఇంతవరకూ పిల్లలు లేరట మా తోడికోడలి తల్లి మహా గడుగ్గాయిలే, కోడల్ని ఇంటి నుండి గెంటేసింది. చెప్పాగా నీకు !"

"ఆ..ఆ... చెప్పావులే అయినా సంగీతా ! వీళ్ళ పిచ్చిగానీ, దీనికి భగవంతుడికి ప్రదక్షిణాలు కాదు చెయ్యాల్సింది – వైఫ్ అండ్ హస్బెండ్ ఇద్దరూ డాక్టర్‌ని కలవాలి" అంది ఆవిడ చదువు తెలివితేటలు ప్రదర్శిస్తూ.

"అంతేలే ఎవరిపిచ్చి వారికానందం. మనకెందుకు

అయినా మా తోడికోడలేం తక్కువదా ! తల్లికి సర్దిచెప్పకూడదూ!" అంది అసలావిడ.

ఒక్కసారిగా నీరజకి గుండె పిండినట్టయ్యింది. "మనకెందుకు అంటూనే విషయమంతా అసెంబ్లీ సమావేశంలా దేవుడి ముందు చర్చించుకుని ఎవరి తీర్మానం వాళ్ళు వినిపించారు. ఇక్కడ కూడా ఎదుటివాళ్ళ గురించి కాకపోతే, ఓ క్షణకాలం కళ్ళు మూసుకుని, ఆత్మ విమర్శ, పరిశీలన చేసుకోరా వీళ్ళు. పైగా వీరి మాటల వల్ల ఇతరులకి కూడా ఆ అవకాశం లేకుండా చేస్తున్నారు" – అనుకుని లేచి నిలబడి భగవంతుడి వైపు తిరిగి కళ్ళు మూసుకుని – "స్వామీ ! మానవులందరికీ మంచిని ప్రసాదించవయ్యా !" అని వేడుకొని, వాళ్ళిద్దరినీ కోపంగా చూస్తూ "ఇద్దరూ – ఇద్దరే" అనుకుంది కసిగా మనసులో.

ఆలయం బయట పచ్చటి గడ్డిని చూడగానే కూచోవాలనిపించింది నీరజకి. కూచున్న మరుక్షణం. "అమ్మా ! ఓ రూపాయుంటే ఇయ్యమ్మా !" అంటూ ఓ అడుక్కునే పిల్ల వచ్చింది. రేట్లు పెరిగాయిలే ! నువ్వేం చేస్తావ్ ! అనుకుంటూ పర్సులోంచీ అర్థరూపాయి బిళ్ళని తీసి ఆ పిల్ల చేతిలో వేసింది నీరజ. నే రూపాయడిగితే, మీరు అర్థ రూపాయే ఇస్తారని తెలుసులే ! అన్నట్టు చూస్తూ ఆ పిల్ల ఇద్దరు ఆడవాళ్ల దగ్గరికి వెళ్ళి వాళ్ళనీ అలాగే అడుగుతోంది. వాళ్ళిద్దరిలో కాస్త పెద్దావిడ ప్రక్కనున్న కవర్‌లోంచి ఓ రెండు అరటిపళ్ళు తీసి ఇచ్చి "ఇది తిను" అంటూ ఆ పిల్లకి అందించింది. ఇష్టం లేకపోయినా తప్పదన్నట్టుగా వాటిని తీసుకుని వెళ్ళింది అడుక్కునే పిల్ల. వాళ్ళిద్దరినీ చూసిన నీరజ – "తల్లీకూతుళ్లయి ఉంటారు. చిన్న వయసున్న అమ్మాయి ప్రెగ్నెంట్‌లా ఉంది. పొట్ట కాస్త ఎత్తుగా ఉంగి ఆరో నెలో ఏడో నెలో అనిపించింది. ప్రక్కనున్న – పెద్దావిడ మరో అరటిపండు తీసి ఒలిచి ఆ అమ్మాయి చేతికిచ్చి తినమంటోంది.

"తల్లిప్రేమ మరి. ఈ పరిస్థితిలో ఆ అమ్మాయికి ఆ ఆదరణ తల్లి తప్ప మరెవరిస్తారులే" అనుకుంది నీరజ.

పరీక్షగా వాళ్లిద్దరినీ చూస్తూ కూర్చుంది నీరజ. వాళ్లిద్దరూ మాత్రం వాళ్ల మాటలలో వాళ్లున్నారు – ప్రక్కనేమీ పట్టించుకోవట్లేదు.

"అరే ! అదేంటి ! ఆ చిన్నపిల్ల కళ్లు తుడుచు కుంటోంది ? పాపం అత్తగారింటి కష్టాలు చెప్పుకుని బాధపడుతోం దనుకుంటా. అయినా ఆ పెద్దావిడైనా చెప్పదా – ఆ విషయాలను ఎత్తవద్దని. కడుపుతో వున్న పిల్ల కష్టపడటం అందులోనూ మానసికంగా అంత మంచిది కాదంటారు" అనుకుంది నీరజ బాధగా. ఈ లోపున ఆ పెద్దావిడ, ఆ అమ్మాయి భుజం చుట్టూ చేయివేసి ఓదారుస్తూ

"ఎందుకమ్మా ! సుధా ! అలా బాధపడతావు. నేనున్నానుగా నీకు. నువ్వేమీ మనసులో పెట్టుకోకు. అసలా ఆలోచనలే రానీకు. చెప్పిన మాట విను. సరేనా !" అంటోంది.

"అదికాదత్తయ్యా ! అన్న ఆ అమ్మాయి మాట విన్న నీరజ ఒక్కసారి బిగుసుకుపోయింది.

"ఏమిటీ ! ఆ అమ్మాయి, ఆవిడని ఏమని పిలిచిందీ? అత్తయ్యా ! అనా ! అంటే .... అంటే వాళ్లిద్దరూ అత్తకోడళ్ళా! నమ్మలేను. ఈ నిజాన్ని నమ్మలేకపోతున్నాను. అనుకోగానే, వాళ్ల మాటలని ఇంకా శ్రద్ధగా వినటం ప్రారంభించింది నీరజ.

"ఏదికాదు ! నే చెప్పిన మాట విను. మీ అన్నయ్య, వదిన మాటలను పట్టించుకోకు. వాళ్ల విషయం తెలియందేం కాదు మనకి. నీకు మేమంతా లేమా ! ఆ జరగాల్సిన ముచ్చటేదో మనింట్లో మనమే జరుపుకుందాం. సరేనా !" అంటోంది ఆ పెద్దావిడ.

"ముందు పుట్టింటివాళ్లు చేయాలంటారు కదత్తయ్యా! మరి మా అన్నయ్యా, వదిన మేం చేయమంటున్నారు. అదే నా బాధ" అంటూ మళ్లీ కళ్లు తుడుచుకుంది కోడలు సుధ.

"అదిగో – ఆ కన్నీళ్లే వద్దంటున్నాను. చెప్పిన మాట వినాలి మరి" అంటోంది లాలనగా అత్తగారు. దానికి బదులుగా –

"అది కాదత్తయ్యా ! అదే మా అమ్మా-నాన్న ఉంటే ఇలా అనేవారా ?" అంది బాధగా.

"పిచ్చిపిల్లా ! ఇప్పుడా మాటలన్నది మీ అమ్మానాన్నలు కాదు. అన్నా వదినలు. అయినా నేను నీకు ఈ విషయంలో కన్నతల్లిని కాలేనా సుధా ! అంది ఆవిడా కాస్తంత భారంగా.

ఆ మాటతో సుధ గబుక్కున ఆవిడ రెండు చేతులూ పట్టుకుని, "అంతకన్నా ఎక్కువగా చూసుకుంటున్నారత్తయ్యా! ఈ రోజుల్లో కూడా ఇలాంటి అత్తగారున్నారంటే ఎవ్వరూ నమ్మరు. ఇదంతా నా అదృష్టం. అంతే" అంది సంతోషం నిండిన మనసుతో.

"నువ్వేకాదు నేనూ అదృష్టవంతురాలినే. గడుగ్గాయి కోడలు వచ్చిందంటే నేనెన్ని కష్టాలు పడ్డాల్సి వచ్చేదో. నువ్వు నాకు ఆడపిల్లలేని లోటు తీర్చావు ఇంటికి వచ్చిందగ్గరనుండి. ఇక ఇప్పటికైనా నా మాట విని మీ అన్నయ్యా వాళ్ల సంగతులేం ఎత్తకు. అబ్బాయికి నేనెలాగో సర్ది చెపుతాను. ఓ వారంలో మంచిరోజులు వస్తాయి. అన్నీ చూసుకుని శ్రీమంతానికి తేదీ నిర్ణయిద్దాం. సరేనా !" అంది ఆవిడ మురిపెంగా నవ్వుతూ.

"మీరెలా చెబితే అలాగే చేద్దాం అత్తయ్యా !" అంది సుధ బుద్ధిగా తల ఊపుతూ. ఇంతలో అత్తగారు ఏదో గుర్తుకు వచ్చినట్టు ఓసారి తల కొట్టుకుని –

"అన్నట్టు సుధా నే మళ్లీ మర్చిపోతానేమో ! ఫంక్షన్‌కి రమ్మని మీ అన్నయ్యా వాళ్లకి ఓ కార్డుముక్క రాసి పడేద్దాం. అది మన విధాయకం. ఇక రావటం, రాకపోవడం అంటావా వాళ్లిష్టం. ఆ సమయానికి గుర్తుచేస్తే అబ్బాయితో చెప్పి రాయిస్తా మర్చిపోకు" అంది.

ఆ మాటలకి సుధ కళ్లు ఒక్కసారిగా చెమర్చాయి. మాటలు కూడగట్టుకుని అత్తగార్ని చూస్తూ –

''అత్తయ్యా ! గుళ్లో దేవుడికి కాదు నే నమస్కరించాల్సింది. నాకళ్ల ముందున్న మీకు !" అంటూ భక్తితో చేతులు రెండూ దగ్గరికి చేర్చి నమస్కరించింది సుధ.

"అంత పెద్ద మాటలు వద్దుకానీ. పద ఇంటికి వెళదాం. బాగా చీకటి పడుతోంది. అబ్బాయి వచ్చే వేళయ్యింది" అంటూ తను లేచి నిలబడి ఓ చేతిని కోడలు లేవడానికి సాయం అందించింది – అత్తగారు.

ఆ అపురూప దృశ్యాన్ని కళ్లప్పగించి, ఏదో నమ్మలేని నిజాన్ని చూస్తూ ఉండిపోయింది నీరజ. కూతుళ్ల కాపురాలు కూల్చే కన్నతల్లులూ ఉన్నారు, అలాగే కూలే కాపురాన్ని నేర్పుతో నింపే అత్తగార్లూ ఉన్నారనిపించింది. ఈ క్షణాన మనిషిని స్థితిని బట్టికాదు పరిస్థితిని బట్టి అంచనా వేయాలేమో అనుకుంది నీరజ మనసులో.

"ఇద్దరూ – ఇద్దరే" – ఈ రోజుల్లో ఉండాల్సిన వాళ్లుకాదు అనుకుంటూనే ఇంకా తను అమ్మవారిని దర్శించుకోలేదని గుర్తొచ్చిన నీరజ లేచి అటుకేసి నడిచింది.

ఒక్కసారిగా గుళ్లో గంటలు గణ గణ మంటూ మోగేసరికి కళ్లు తెరిచి, చేతి వాచీకేసి చూసుకున్న నీరజ టైం 7.15 ని. అనుకునేసరికి కంగారనిపించింది. "అమ్మో! అప్పుడే నేనొచ్చి చాలాసేపయ్యింది. ఇంట్లో ఆయనా, పిల్లలూ కంగారు పడుతుంటారు". అనుకుంటూ లేచి ఓ చేత్తో, చీరని సవరించుకుంటూ గబగబా తలొంచుకుని నడుస్తున్నదల్లా "ఠప్" మని ఓ జంటకి ఢీ కొట్టింది. ఆ దెబ్బకి వాస్తవంలోకి వచ్చి –

"సారీ .... వెరి సారీ అండీ – చూసుకోలేదు" అంది తడబాటుతో.

"ఫరవాలేదు. మేమూ చూసుకోలేదు లెండి" అంటూ చిన్నగా నవ్వుతూ ఆ అమ్మాయి భర్త చేతిని పట్టుకుని ముందుకు నడిచింది.

అప్పుడు గుర్తొచ్చింది నీరజకి, ఇందాక గుడికి రాగానే ఆ ముసలావిడ చూపించిన జంట వీళ్లేనని, "అదేం పేరబ్బా ఆవిడ చెప్పింది ?" అని బుర్రలోకి వేలు చేర్చేలోపే గుర్తొచ్చేసింది నీరజకి. ఆపేరు సీతాలక్ష్మి అని.

"ఆ.. ఆ ... అవును సీతాలక్ష్మిగారి కోడలు – కొడుకు. ఇందాక ఆ ముసలావిడ అంటోందిగా ఇంట్లో

పొద్దున్న జరిగిన గొడవని మొగుడికి చెప్పటానికే గుడికి తీసుకువచ్చిందని". అని ఆ మాటలు గుర్తుచేసుకుంటూ ఆ జంట వెనకగా నడుస్తున్న నీరజకి వాళ్ల మాటలు అప్రయత్నంగానే వినపడుతున్నాయి. "తొందరగా వెడదామండీ ఇంటికి ! ఇంకెక్కడికీ వద్దు ప్లీజ్ ! అంటోంది భర్తతో. "అదేంటి శైలూ ! అప్పుడేనా ! ఇంకాసేపలా తిరిగి వద్దాం !" అంటున్నాడతను. "ఉహు-వద్దు. మరో రోజెప్పుడైనా వెళదాం. ఇంట్లో అత్తయ్యగారొక్కరే ఉన్నారు". "ఏయ్ ! ఈ రోజు మన 'మ్యారేజ్ డే' అన్న విషయం గుర్తుందా! ఇంకోరోజు ఈ రోజెలా అవుతుంది. అయిన అప్పుడు మాత్రం అమ్మ ఒక్కత్తే కాక మరెవరుంటారు?" అంటున్నాడతను కాస్త కోపంగా.

"ప్లీజ్ ! అప్పుడే కోపమే ! ఇవాళ పొద్దుటినుండీ అత్తయ్యగారు కాస్త నలతగా ఉన్నారు. ఇంట్లో ఈ పూట వంట చెయ్యాలి. ఈ పూటకి ఆవిడకి కాస్త రెస్ట్ ఇస్తే రేపు మనిద్దరం ఆఫీసుకి వెళ్ళగలం. అయినా, బయట తిరిగే బదులు కులాసాగా, హాయిగా ఇంట్లో ఒకరెదురుగా ఒకరం కూచుని కబుర్లు చెప్పుకుంటే ఎంత బాగుంటుంది.

"గబగబా పని పూర్తిచేసుకుని అలా మనింట్లోనే ఎంజాయ్ చేద్దాం సరేనా ! మా వారు బంగారం కదూ !" అంటూ ఆ అమ్మాయి బుజ్జగిస్తూ భర్త చేతిని సుతారంగా ఒత్తింది.

ఆ చేతలకీ చూపులకీ మెత్తబడ్డ ఆ అబ్బాయి కొంటెగా నవ్వుతూ – చేతులు పైకెత్తి –

"బౌల్డ్ శైలూ ... క్లీన్ బౌల్డ్ చేసేశావ్. పద ఇంటికెళ్లాక నీ పని చెప్తా" అంటూ జేబులోంచి బండి కీచైన్ తీసి, "నువ్విక్కడే ఉండు. నేవెళ్లి బైక్ తీసుకువస్తాను" అంటూ అటు ప్రక్కగా ఉన్న పార్కింగ్ వైపు వెళ్ళాడు. భర్త చిలిపి మాటకి ముసిముసిగా నవ్వుకుంటున్న ఆ అమ్మాయిని తన మనసులోనే అంచనా వేసుకుంటూ దాటిపోయింది నీరజ ముందుకి.

"నిజంగా ఆ పెద్ద వాళ్ళిద్దరూ ఈ అమ్మాయిని ఎంత తప్పుగా అర్థం చేసుకున్నారు. అంత వయసున్న వాళ్లనాలా, పెదమనసున్న ఈ అమ్మాయిని అభినందించాలా ! నిజానికి ఇంట్లో వాళ్లిద్దరికీ మధ్యన జరిగిన తగాదాని మాట వరసకి కూడా భర్తకి చెప్పలేదని స్పష్టంగా తెలుస్తోంది. పెళ్ళిరోజునైనా కూడా చూసుకోకుండా ఆ పిల్ల ఎంత హుందాగా భర్తని ఒప్పించింది. ఎంతో విలువైన ఆ రోజుని మరో అపార్థానికి తావివ్వకుండా సమర్థించుకోడానికి ప్రయత్నిస్తోంది. ఎంత గొప్ప వ్యక్తిత్వం, దానికి తగ్గట్టు అతను భార్య మాటలని సహృదయంతో ఆలకించాడు. ఎవరికైనా ఇంతకన్నా ఏం కావాలి" అనుకుని చెప్పుల స్టాండులో పిల్లాడికి ఓ రూపాయిచ్చి చెప్పులేసుకుని రోడ్డుపైకి వచ్చిన నీరజ, రయ్యిమని బండిపై వెడుతున్న ఆ జంటకేసి మురిపెంగా చూస్తూ "ఇద్దరూ – ఇద్దరే" అని అనుకోకుండా ఉండలేకపోయింది మనసులో.

ఇంటికి చేరిన నీరజ పనులన్నీ యథావిధిగా పూర్తి చేసినా గుడిలో సంఘటనలన్నీ ఒకటొకటిగా మనసుకి తడుతూనే ఉన్నాయి. ఆ రాత్రికి పనులన్నీ పూర్తిచేసుకుని ప్రక్క చేరిన నీరజ కళ్లు మూసుకుని భగవంతుడిని మనసులోనే వందనం చేసుకుంటూ–

"స్వామీ ! "గుళ్లో భూగోళం" చూపించావు. నీవు దేనికైనా సమర్థుడవు. మంచీ, చెడూ రెండూ ఉంటాయనీ, ఒకటిలేనిదే మరోదానికి విలువలేదని కళ్లకు చూపించావు. కష్టం చిన్నదైనా, పెద్దదైనా బాధ బాధే కదా ! కష్టానికి కలత చెందక, ఎదురీది దరిచేరే ధైర్యాన్ని, సహనాన్ని, ఓర్పునీ, నేర్పునీ నీ భక్తులకు, ఆర్తులకు అందించు. మరో చిన్న విన్నపం తండ్రీ ! సుఖమూ, దుఃఖమూ రెండు తప్పనివే అయినా, సుఖానికి అతిదూరంలో దుఃఖాన్నీ, దుఃఖానికి అతి చేరువలో సుఖాన్ని నిలుపు. ఎందుకో తెలుసుగా ! నాలాంటి తట్టుకోలేని వారికి ఆ కాస్త వ్యవధే భరించలేనిది. తెల్లారి మేలుకొలుపుతో నా జీవితం ప్రశాంతంగా నడిచేటట్టు చూడు తండ్రీ !" అంటూ కళ్లు మూసుకుని ప్రశాంతంగా